క్లుప్తంగా

సుబ్బాలమ్మ దేవస్థానం వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



సుబ్బాలమ్మ దేవస్థానం వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం 7వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఆ దేవస్థానం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయుడు సోమవారం ఆవిష్కరించారు. సోమవారం నుంచి దేవస్థానం వార్షికోత్సవ పూజలు మొదలయ్యాయి. దేవస్థానంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో స్థానిక గోల్డ్ మార్కెట్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యుడు యర్రంశెట్టి మూర్తి, బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, రాయుడు నాని, రేకపల్లి సూరిబాబు, అనుపోజు శ్రీను తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా సుబ్బాలమ్మ దేవత సన్నిధిలో కుంకుమార్చన, నవచండీ హోమం జరుగుతుందని దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యుడు మూర్తి తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం



భవన నిర్మాణ కార్మికుడు సురేష్‌ను పరామర్శిస్తున్న శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భవన నిర్మాణ కార్మికుడికి తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ఆర్థిక సాయం అందజేశారు. తాళ్లరేవు రెడ్డివారిపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు రెడ్డి సురేష్ ఇటీవల ఇంజరంలో భవన నిర్మాణ పని చేస్తుండగా రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ పడిపోయాడు. ఈ ప్రమాదంలో సురేష్ వెన్నుముకకు తీవ్ర గాయం కాగా ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో శామ్యూల్ సాగర్ సోమవారం బాధితుడిని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

ఘనంగా మహా సౌరయాగం



సౌరయాగంలో పాల్గొన్న దంగేటి రాంబాబు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగం 19వ రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో గణపతి పూజ, సౌర అష్టాక్షరీ జపాలు, త్రిచపూజ, గోపూజ, చండీహోమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించి యాగం విశిష్టతను వివరించారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

అమలాపురం రూరల్: మండలంలో రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కడలి ధర్మప్రసాద్ కోరారు. కామనగరువు సచివాలయంలో సోమవారం రైతుసేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో స్వంత భూమి కలిగిన రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందలన్నారు. ఈ నమోదు కార్యక్రమం రైతుసేవా కేంద్రాలలో జరుగుతుందన్నారు. ఈ నెల 25 లోపు రైతుసేవా కేంద్రాల వద్ద విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని కోరారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి వీర రాఘవులు ప్రచారం

అమలాపురం టౌన్: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు పట్టణంలో పలు వీధుల్లో సోమవారం ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు. స్థానిక సూర్యనగర్, ప్రకాశం వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం చేశారు. ప్రచారానికి ముందు స్థానిక యూటీఎఫ్ హోంలో స్థానికంగా కొంత మంది పట్టభద్రులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల సమస్యలపై తాను పోరాడతానని, తనను గెలిపిస్తే చట్టసభల్లో పట్టభద్రుల వాణిని వినిపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సాధనాల వెంకట్రావు, బొంతు రమణ, వడ్డి నాగేశ్వరరావు, శెట్టిబత్తుల తులసీరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల ప్రచార కర పత్రాలను వీరరాఘవులతో పాటు ప్రజా సంఘాల నాయకులు విడుదల చేశారు.

పేరు మార్చి.. ప్రజలను ఏమార్చి!

- భూముల రీసర్వేలో బయటపడుతున్న డొల్లతనం
- అరకొర సిబ్బందితో లోప భూయిష్టంగా పనులు
- వైఎస్సార్ సీపీ హయాంలోని భూహక్కు చట్టమే యథాతథంగా అమలు



ఎంట్రుకోనలో రీ సర్వే నిర్వహిస్తున్న సర్వే బృందం

అల్లవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సమగ్ర భూహక్కు చట్టాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసింది. సమగ్ర భూ హక్కు చట్టంతో మీ భూములను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లాగేసుకుంటుందని ఎన్నికలకు ముందు ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కూటమి ప్రభుత్వం సఫలీకృతమైంది. ఈ క్రమంలో అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూహక్కు చట్టాన్ని రీ సర్వే ప్రాజెక్టుగా పేరు మార్చి ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే చేపట్టారు.

ప్రాథమిక నియమాలు పాటించకుండానే..

రీ సర్వే ప్రారంభం నుంచి డొల్లతనమే కనబడుతుంది. ఇందులో కూటమి ప్రభుత్వం కొత్తగా చేస్తున్నది ఏమీ లేదన్నది నిర్వివాదాంశం. గత ప్రభుత్వంలో ఏ తరహాలో రీ సర్వే ప్రారంభించారో అదే తరహాలో రీసర్వే చేపట్టారు. తొలుత డ్రోన్ సహాయంతో గ్రామ నైసర్గిక స్వరూపాన్ని, శాటిలైట్ ఆధారంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించిన తర్వాత ఫీల్డ్ స్థాయిలో రీ సర్వే ప్రారంభించారు. పైలెట్ గ్రామాల్లో ఇద్దరు సర్వేయర్‌లతో పాటుగా ఒక వీఆర్‌ఓ కలిసి క్షేత్ర స్థాయి రీ సర్వే చేపట్టారు. ప్రతి గ్రామంలో నాలుగు బృందాలుగా ఏర్పడి పైలెట్ గ్రామాన్ని భాగాలుగా విభజించుకుని, ఆయా భాగాల్లో ప్రభుత్వ భూములు, రైత్వారీ భూములకు హద్దులను నిర్ధారించడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రాథమిక నియమాలను పాటించకుండానే రీ సర్వే జరుగుతుందని అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. తొలుత గ్రామ సరిహద్దులు నిర్ధారించుకుని, ఆ తర్వాత ప్రభుత్వ భూములు, జిరాయితీ, విస్తీర్ణం, సర్వే నెంబర్లు, సబ్ డివిజన్ వారీగా సరిహద్దులు నిర్ధారించాల్సి ఉంది. అయితే సర్వే శాఖాధికారులు ఇవేమీ పట్టించుకోకుండా సర్వే సిబ్బందికి టార్గెట్ విధిస్తూ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. అధికారులు అడిగిందే తడవు సిబ్బంది తూతూ మంత్రంగా సర్వే చేస్తున్నారే తప్పా పారదర్శకంగా జరగడం లేదు. గొలుసు లాగడానికి ఇద్దరు సర్వేయర్లు, కొలతలు నమోదు చేయడానికి వీఆర్‌ఓతో రీ సర్వే చేయిస్తున్నారు. అరకొర సిబ్బంది కారణంగా కాలువలు, డ్రెయిన్లు, తుప్పలు, ప్రమాదకర ప్రాంతాల్లో సర్వే సిబ్బంది చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.

400 ఎకరాల్లో పూర్తి

అల్లవరం మండలంలోని ఎంట్రుకోన గ్రామంలో మొత్తం 742 ఎకరాల విస్తీర్ణం ఉండగా, 135 ఎకరాల్లో ప్రభుత్వ భూమి, 607 ఎకరాలు జిరాయితీగా నిర్ధారించారు. ఇప్పటి వరకు 400 ఎకరాల్లో రీ సర్వే పూర్తికాగా 207 ఎకరాల్లో చేయాల్సి ఉంది. మార్చి 31 నాటికి ఎంట్రుకోన గ్రామంలో రీ సర్వే పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. రీ సర్వేతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. విస్తీర్ణంలో వ్యత్యాసాలు, సర్వే నెంబర్ల మార్పులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, భూమిపై రైతు లేకుండానే సర్వే చేయడం, సరిహద్దు తగదాలు చోటు చేసుకునే విధంగా ఉండే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

మద్యం దుకాణాల మూసివేత

యానాం: ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో సరిహద్దున ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం నియోజకవర్గ పరిధిలోని మద్యం షాపులను ఈ నెల 25 నుంచి 27 వరకు మూసివేయాలంటూ సోమవారం ఆర్‌ఏఓ, డిప్యూటీ కమిషనర్(ఎక్సైజ్) మునిస్వామి ఆదేశాలు జారీ చేశారు. మార్చి 3న కౌటింగ్ రోజున సైతం మద్యం అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశించారు. ఎఫ్ఎల్1, ఎఫ్ఎల్2, బార్ అండ్ రెస్టారెంట్లు సైతం మూసివేయాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

అధికారులతో నేడు మంత్రి సాయిశర్వణన్ సమీక్ష

యానాం: పుదుచ్చేరి ఆది ద్రావిడ సంక్షేమశాఖ మంత్రి జె సాయి శర్వణన్ కుమార్ మంగళవారం అధికారులతో సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షించనున్నారని సోమవారం ఆర్‌ఏఓ మునిస్వామి ఓప్రకటనలో తెలిపారు. ఆది ద్రావిడ శాఖ పరంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి గృహ నిర్మాణం, స్కాలర్‌షిప్‌లు, వైద్య, ఆరోగ్యానికి ఇచ్చే సహాయం అమలు తీరును సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొననున్నారు.

వైభవంగా వీరభద్రుని సంబరం

- పోటెత్తిన భక్తజనం
- భారీ అన్న సమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర మాఘమాసం, సోమవారం పర్వదినం సందర్భంగా మండలంలోని పలుచోట్ల వీరభద్రుని సంబరాలు వైభవంగా జరిగాయి. ప్రధానంగా కాపులపాలెంలో నరహరిశెట్టి వీరబాబు బ్రదర్స్ ఆధ్వర్యంలో జరిగిన 53వ తీర్థ మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ గద్దె వద్ద నేతి కుండలో వెలసిన వీరన్నబాబును దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత స్థానిక వృద్ధ గౌతమీ గోదావరిలో పవిత్ర స్నానాలాచరించి వీరభద్రుణ్ని ఊరేగింపుగా పుట్ట వద్దకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి జమ్మిచెట్టు వద్దకు వెళ్లి వీరన్నబాబుకు జంగాలు పూజ చేస్తారు. ముఖ్యంగా సంతానం లేని వారు నదీస్నానం చేసి ఉపవాసంతో వీరభద్రునికి పూజ చేయడం ద్వారా వారి కోరిక ఈడేరుతుందని భక్తుల నమ్మకం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు పదివేల మందికి పైగా భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రి వీరముష్టులతో వీరనాట్యం, రాత్రంతా సంబరం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చేశారు. తాళ్లరేవు రోశ్లవారి వీధిలో వేంచేసి యున్న వీరభద్రుని ఆలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ బృందం ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరభద్ర దేవస్థాన కమిటీ ప్రతినిధులు, స్థానిక పవర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వేతనం పెంపు కోరుతూ అంగన్‌వాడీల ధర్నా



ముమ్మిడివరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ముమ్మిడివరం: కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ ముమ్మిడివరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీలు ధర్నా చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అనేక సేవలందిస్తున్న తమకు కనీస వేతనం చెల్లించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలనీ, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో విడుదల చేయాలని వారు కోరారు. పలు డిమాండ్లతో గతంలో 42 రోజుల పాటు సార్వత్రిక సమ్మె చేసిన సందర్భంగా జీతాలు పెంచుతామని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఇప్పటివరకు ఆ సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు ఎస్.దుర్గామహేశ్వరి, కార్యదర్శి ఎం.జయలక్ష్మి, గాలి మంగాయమ్మ, జి.అనంతలక్ష్మి, శ్రీదేవి, సుబ్బలక్ష్మి, అరుణకుమారి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి బ్లడ్ డొనేషన్ క్లబ్ ఏర్పాటుకు కృషి

ట్రస్ట్ జనరల్ మేనేజర్ స్వామినాయుడు



పి.మల్లవరంలో మాట్లాడుతున్న స్వామినాయుడు

తాళ్లరేవు: అత్యవసర సమయాల్లో రోగులకు రక్తాన్ని అందించేందుకు గానూ పి.మల్లవరం గ్రామంలో చిరంజీవి వాలంటరీ బ్లడ్ డొనేషన్ క్లబ్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ జనరల్ మేనేజర్ రవణం స్వామినాయుడు తెలిపారు. గ్రామంలో ఓ వివాహానికి హాజరైన ఆయనను కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ధూళిపూడి నాగేంద్రప్రసాద్ తదితరులు కలిశారు. వ్యవసాయ కూలీలు, నిరుపేదలు అధికంగా ఉన్న తాళ్లరేవు మండలంలో చిరంజీవి బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాలలో అనేక మందికి రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ నగరాలతో పాటు కాకినాడలో చిరంజీవి వాలంటరీ బ్లడ్ డొనేషన్ క్లబ్ ఉందన్నారు. చిరంజీవితో మాట్లాడి, ఆయన ఆదేశాల మేరకు పి.మల్లవరంలో క్లబ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

‘సాయ్’ ఎంపిక పోటీలకు 60 మంది హాజరు



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

యానాం: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)యానాం శాఖలో శిక్షణ పొందేందుకు మొదటి రోజు సోమవారం నిర్వహించిన ఎంపిక పోటీలకు ఆంధ్రప్రదేశ్, ఒడిశాలోని బరంపురం, కర్నూలు, కడప, ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు హాజరైనట్లు సాయ్ ఇన్‌చార్జి ఎన్ ఉదయకుమార్ తెలిపారు. బ్యాడ్మింటన్ బాలురు(రెసిడెన్షియల్), స్విమ్మింగ్ బాలురు(రెసిడెన్షియల్), బాలికలు (నాన్ రెసిడెన్షియల్) విభాగాలకు ఎంపిక పోటీలను నిర్వహించారు. ఆసక్తి గల అభ్యర్థులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, క్రీడల్లో ప్రతిభ చూపిన సర్టిఫికెట్లు, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్‌లు రవితేజ, ఎన్ రాజేష్ పాల్గొన్నారు.

సామాజిక వేత్త పచ్చిమాల మృతి



పచ్చిమాల బాబ్జి

అమలాపురం రూరల్: అమలాపురం మండలం వన్నెచింతలపూడికి చెందిన పోరాట యోధుడు, సామజిక కార్యకర్త పచ్చిమాల బాబ్జి (74) సోమవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కూలీ రేట్లు పెంచాలని అనేక ఉద్యమాలు చేసి కూలీలకు అండగా నిలిచారు. రేపు ఉదయం వన్నె చింతలపూడి అంబేడ్కర్‌నగర్‌లో అంత్యక్రియలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు. ఈయన మృతి పట్ల అంబేడ్కర్ వాదులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

అన్నదాన ట్రస్టుకు రూ.25 వేల విరాళం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు విరాళం అందజేశారు. కాకినాడకు చెందిన కూచి వెంకట విజయానంద భగీరథ శర్మ దంపతులు రూ.25 వేలను సోమవారం రాత్రి ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు అందజేశారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

ఐ.పోలవరం: ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు మండలంలో మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వీరికి వచ్చే ఏడాది నుంచి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనాలు ఇస్తారన్నారు. ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశరావు, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మంత్రి సాయిశర్వణన్‌కు సత్కారం

యానాం: రెండు రోజుల అధికార పర్యటన నిమిత్తం సోమవారం రాత్రి పుదుచ్చేరి నుంచి యానాంకు వచ్చిన పుదుచ్చేరి ఆది ద్రావిడ సంక్షేమశాఖా మంత్రి జె సాయిశర్వణన్‌కు స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఘన స్వాగతం పలికారు. ఆయను సత్కరించి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల విజయవంతంపై అభినందనలు

అమలాపురం రూరల్: అంతర్వేది శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు పది రోజుల పాటు విజయవంతం చేసిన అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి అభినందించారు. సోమవారం సాయంత్రం జిల్లా స్థాయి అధికారులతో కలెక్టరేట్‌లో ఉత్సవాల నిర్వహణ తీరు, లోటుపాట్లపై జిల్లా స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ బిఎల్ఎన్ రాజకుమారి, ఆర్డీవోలు కే మాధవి, పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, డీఎస్పీలు మురళీకృష్ణ ప్రసాద్, పీడీలు శివశంకర్ ప్రసాద్, మధుసూదన్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గురుబ్రహ్మ అవార్డు అందుకున్న భరత్



తెలంగాణ మంత్రి నాగేశ్వరరావు, సినీ నటుడు రావు రమేష్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న భరత్

అమలాపురం టౌన్: హైదరాబాద్ నాంపల్లి లలిత కళా తోరణంలో సుచిర ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ సభలో అమలాపురం శ్రీ వాగ్దేవి స్కూలు డైరెక్టర్ పరసా భరత్ గురుబ్రహ్మ అవార్డు అందుకున్నారు. సుచిర ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో శ్రీవాగ్దేవి స్కూలులో 8వ తరగతి విద్యార్థిని మల్లాడి రేణుశ్రీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్, 4వ తరగతి విద్యార్థి టి.హర్ష ప్రభవ్ జిల్లా ఫస్ట్ ర్యాంక్, 6వ తరగతి విద్యార్థి బి.మణికంఠ షణ్ముఖ జిల్లా సెకండ్ ర్యాంక్ సాధించి ఆ స్కూలు గురుబ్రహ్మ అవార్డుకు ఎంపికయ్యేలా ప్రతిభ చాటారు. స్కూలు డైరెక్టర్ భరత్ కార్యక్రమంలో పాల్గొని అవార్డును స్వీకరించారు. ర్యాంక్‌లు సాధించిన ముగ్గురు విద్యార్థులు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. సుచిర ఇండియా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వై.కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, సినీ నటుడు రావు రమేష్ చేతుల మీదుగా అవార్డును భరత్‌కు ప్రదానం చేశారు. స్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీరామచంద్ర మూర్తి, హెచ్‌ఎం పిచ్చిక సుబ్రహ్మణ్యం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ప్రజ్ఞా సాహితీ వార్షికోత్సవం



బహుమతులు, సత్కారాలు అందుకున్న వారితో వెంకటేశ్వరరావు

ఐ.పోలవరం: సుప్రసిద్ధ వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ ప్రజ్ఞా సాహితీ ఐదవ వార్షికోత్సవం పాశువుల్లంకలో ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన వారికి అవార్డులు, ఆత్మీయ సత్కారాలు, బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు జనిపల్లి సత్యనారాయణ, ఎస్.ఎన్. మునేశ్వరరావు, గుత్తాల వెంకటేశ్వరరావు, రాయపురెడ్డి బాబిలకు అవార్డులు అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీ టీచర్లకు సావిత్రి భాయి పూలే, విద్యా క్రాంతి అవార్డులు అందజేశారు. ఇటీవల పాఠశాలలు, కళాశాలల స్థాయిలో జరిగిన క్రీడల్లో ప్రతిభ చూపిన విజేతలు, డిబేట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూర్తి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జివివి.సత్యనారాయణ, రేవు అప్పలస్వామి, ఉంగరాల వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాద్, ఎస్ సత్యనారాయణ, మెల్లం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళా కిరీటి పురస్కారాల ప్రదానం



కళా కిరీటి పురస్కారాన్ని అందుకుంటున్న కవయిత్రి మహాలక్ష్మి



పురస్కారాన్ని అందుకున్న వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవయిత్రి సబ్బెళ్ల వెంకట మహాలక్ష్మికి కళా కిరీటి పురస్కారం లభించింది. గోదావరి కల్చరల్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా మలికిపురం మండలం వీవీ మెరకలోని అల్లూరి సత్యనారాయణరాజు ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన సాంస్కృతిక కళా సంబర మహోత్సవంలో మహాలక్ష్మి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఆమెకు పురస్కార ప్రదానం జరిగింది. అటు చదువులో ఉత్తమంగా రాణిస్తున్న మహాలక్ష్మి ఇటు కవయిత్రిగా కవితలు రాస్తూ సాహిత్య ప్రతిభను ప్రదర్శిస్తున్నారని డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. ఆమెను పట్టణానికి చెందిన కవులు, రచయితలతో పాటు కుటుంబీకులు, బంధువులు అభినందించారు.

యువ రచయతకు కళా కిరీటి పురస్కారం

తాళ్లరేవు: తాళ్లరేవుకు చెందిన యువ రచయత పినపోతు వెంకటేశ్వరరావు కళా కిరీటి పురస్కారాన్ని అందుకున్నారు. ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన మలికిపురంలో పంచమ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కళా సంబరాలలో వెంకటేశ్వరరావుకు అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రామారావు ఉపాధ్యక్షుడు కడలి కృష్ణారావులు అవార్డును అందించి సత్కరించారు.

వైభవంగా గాయత్రీ హోమం

అమలాపురం టౌన్: స్థానిక బైపాస్ రోడ్డులోని దక్షిణేశ్వర శక్తిస్థల్‌లో గౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో గాయత్రీ హోమం సోమవారం వైభవంగా జరిగింది. హోమంతో పాటు పుట్టిన రోజు సంస్కారం, మహదాశీర్వాదం తదితర పూజాదికాలు జరిగాయి. హోమం అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. ముమ్మిడివరం గ్రామానికి చెందిన చిన్నారి చిలకలపూడి రిషికాంత్ సహిష్ణుకు పుట్టిన రోజు సంస్కారాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజాదికాల్లో అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు నాగ కనకదుర్గ, గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, చిలకలపూడి శివరామకృష్ణ, దుర్గా మాధవి దంపతులు, గోకరకొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో నెంబర్ కాలువకు సాగునీరు అందించాలి

అల్లవరం: బెండా కాలువ పరిధిలోని నాలుగో నెంబర్‌కు సాగునీరు ఇవ్వాలని కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావుకు సోమవారం వినతిపత్రం అందించారు. నాలుగో నెంబర్ కాలువ ఆయకట్టుపై ఉన్న వరి పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకోచ్చారు. ఇప్పటికే పంచనీటి కాలువ నుంచి ఉప్పునీరు ఎదురెక్కి పంట పొలాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేయకపోతే సాగు చేపట్టిన రైతులు తీవ్ర నష్టాలకు గురవుతారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి సాగునీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగునీరు విడుదల చేయకుంటే ఉద్యమిస్తాం



జి.వేమవరంలో సాగునీటి కోసం అధికారులను నిలదీస్తున్న రైతులు

ఐ.పోలవరం: వరి పొలాలకు సాగునీరు విడుదల చేయాలని ఇరిగేషన్ కార్యాలయం, అధికారుల చుట్టూ గత పది రోజులుగా తిరుగుతున్నా పట్టించుకొనే నాథుడే కరవయ్యాడని అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఇరిగేషన్ అధికారులను రైతులు హెచ్చరించారు. ఐ.పోలవరం మండలంలోని ఎదుర్లంక, టి.కొత్తపల్లి ఉత్తర కాలువ, జి.వేమవరం, గుత్తినదీవి కాలువ ఆనుకొని మూడు వేల ఎకరాలకు సాగునీరు లేక భూమి నెరలు వేస్తుందని, తక్షణమే నీటిని విడుదల చేయాలని ఆ ప్రాంత రైతులు డిమాండ్ చేశారు. నీటి ఎద్దడి ఉన్న పంట పొలాలను సోమవారం ఇరిగేషన్ ఎస్సీ గోపీనాథ్ సిబ్బందితో కలసి పరిశీలించారు. జి.వేమవరం సర్పంచ్ నల్లా సుదర్శన్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. సాగునీటి విడుదలకు చర్యలు తీసుకొంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈయన వెంట నీటి సంఘ అధ్యక్షులు చిలువూరి సుబ్బరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సీవీ రామన్‌కు బెస్ట్ స్కూలు అవార్డు

అమలాపురం టౌన్: స్థానిక సర్ సీవీ రామన్ స్కూలుకు బెస్ట్ స్కూలు అవార్డు లభించింది. సుచిర ఇండియా ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటడంతో స్కూలు ఈ అవార్డుకు అర్హత సాధించింది. తెలంగాణా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు, సినీ నటుడు రావు రమేష్ చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం జరిగింది.